ఇంటింటికీ తాగునీరందిస్తాం

- ఇది మా ప్రభుత్వం బాధ్యత
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా





మాట్లాడుతున్న నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నంద్యాల(సిటీ): నంద్యాలలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని, ఇది తమ ప్రభుత్వ బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ అన్నారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. సమావేశ ప్రారంభంలో టీడీపీ నాయకులు పట్టణానికి తాగు నీరందించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. సభ మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేయాల్సి వస్తుందని వారిని హెచ్చరించారు. అనంతరం సభలో పట్టణంలో తాగునీటిపై చర్చ జరిగింది.

టీడీపీ అంటే తెలుగు డిస్టబెన్స్ పార్టీ

సభామర్యాదలు పాటించకుండా ప్రతిపక్ష నాయకులు చర్చను తప్పుదోవ పట్టించడం సరికాదని 36వ వార్డు కౌన్సిలర్ నాగిణిరెడ్డి మండిపడ్డారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాకముందే నీటిపై చర్చ చేయాలనడం తగదన్నారు. టీడీపీ అంటే తెలుగు డిస్టబెన్స్ పార్టీ అని ఎద్దేవా చేశారు. సభలో చర్చలకు ప్రత్యేకంగా సమయం ఉంటుందని, కానీ ఇలా ముందుగానే నీటి పై వివరణ అడగడం సరికాదన్నారు. అయితే త్వరలోనే నంద్యాలకు తాగునీరు తీసుకొస్తామని, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారన్నారు.

నిబంధనల ఉల్లంఘనులకు నోటీసులు

భవన నిర్మాణాల్లో పట్టణ ప్రణాళిక నిబంధనలను అతిక్రమించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. ఇప్పటికే అక్రమ కట్టడాలు చేపట్టిన 12 మంది యజమానులకు నోటీసులు జారీ చేశామని, మరో 17 మందికి కూడా త్వరలో పంపుతామన్నారు. అక్రమార్కులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తాగు నీటిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ మాట్లాడుతూ పట్టణ జనాభా భారీగా పెరిగిందన్నారు. పెరిగిన జనాభాకు సరిపడా నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కో–ఆప్షన్ మెంబర్లు సలాముల్లా, పడకండ్ల సుబ్రమణ్యం, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఇంజినీర్లు రమణామూర్తి, మధుకుమార్, శ్రీనివాసరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, మెప్మా సీఎంఎం విజయ భాస్కర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

3న మండల మీట్

దొర్నిపాడు: ఈనెల 3న ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగఅనసూయ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు పూర్తి సమాచారంతో రావాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చక్కటి వేదిక మండల్‌మీట్ అని అన్నారు.

2న తిక్కస్వామి ఉరుసు



నంద్యాల(అర్బన్): స్థానిక సాయిబాబా నగర్‌లో వెలసిన హజరత్ సయ్యద్‌షా షహిన్‌షా అవులియా చిస్తివుల్ ఖాదరి కుద్థాహు (తిక్కస్వామి) ఉరుసు రేపటి నుంచి ప్రారంభం కానున్నట్లు దర్గా ధర్మకర్తలు మహమ్మద్‌హుసేన్, చాంద్‌బాషా తెలిపారు. 2వ తేదీ గంధం, 3న ఉరుసు, 4, 5, 6 తేదీల్లో జియారత్ నిర్వహించనున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పది, ఇంటర్ పరీక్ష ఫీజుల షెడ్యూల్ విడుదల

నంద్యాల(సిటీ): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం పదవ తరగతి, ఇంటర్మీడియట్ (ప్రైవేట్ లేదా డిస్టెన్స్) పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ మంగళవారం తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. అపరాధ రుసుం లేకుండా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 16 నుంచి 22వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రూ. 50 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 2వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అదేవిధంగా తాత్కాల్ ద్వారా ఫీజు చెల్లించేందుకు మార్చి 3వ తేదీ నుంచి 7 వరకు గడువు ఉందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏపీ ఆన్‌లైన్/మీసేవ ద్వారా నగదు చెల్లింపులు చేయాలన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

నంద్యాల(అర్బన్): ప్రముఖ రచయిత ముర్తుజా రచించిన శ్రమయేవ జయతే(నంద్యాల శ్రమదానం బ్రిడ్జి కథ) పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు సామాజిక సేవా కార్యకర్త శంకరయ్య తెలిపారు. స్థానిక వివేకానంద ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, బాల సాహితీవేత్త హరికిషన్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఈ సభకు సాహితీ అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

విద్యార్థికి అభినందన

నంద్యాల(అర్బన్): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 26న నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న మణికుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శశికళ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త గంగన్న అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనియన్ టు పీఓ శ్రీనివాసులు, అధ్యాపకులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించండి



చిత్రేనిపల్లె అంగన్‌వాడీలో భోజనాన్ని పరిశీలిస్తున్న సూపర్ వైజర్

రుద్రవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూపర్ వైజర్ లక్ష్మీదేవి సూచించారు.మండల పరిధిలోని చిత్రేనిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె గ్రామ సర్పంచు గుండా వరలక్ష్మితో కలిసి తనిఖీ చేశారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ ఉన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనార్దన్ రెడ్డికి గిరిజనుల సత్తా చూపుతాం



మాట్లాడుతున్న రాజునాయక్

నంద్యాల(అర్బన్): టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె ఎస్‌ఐ శంకర్‌నాయక్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, తీరు మార్చుకోకపోతే తమ సత్తా చూపుతామని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ హెచ్చరించారు. దస్తగిరి అనే యువకుడి మృతి కేసులో ఎలాంటి ఆధారాలు చూపకుండా గిరిజన ఎస్‌ఐను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. స్థానిక జీపీఎస్ కార్యాలయంలో మంగళవారం గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే టీడీపీ నాయకుల ఆరోపణలతో ఎస్‌ఐపై వేటు వేయడం జిల్లా అధికారులకు తగదన్నారు. దీని వెనుక దాగి ఉన్న కుట్రను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బీసీపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జీపీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలునాయక్, వెలుగోడు వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, రవీంద్రనాయక్, సంజీవనగర్ తండా సర్పంచ్ శివశంకర్ నాయక్, ఎంపీటీసీ వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



నర్సిపల్లెలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు లబ్ధదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని అల్లూరు, నర్సిపల్లె గ్రామాల్లోని జగనన్న లేఅవుట్, సొంత స్థలాల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ఫిబ్రవరిలో తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. అల్లూరు గ్రామంలో 82 గృహాలు మంజూరు కాగా 57 మంది నిర్మాణాలు, నర్సిపల్లెలో 74కు గాను 34 మంది నిర్మాణాలు చేపట్టారన్నారు. నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి పంపితే వారి పట్టా రద్దు చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సాధిక్ బాషా, ఏపీఎం శేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేద్దాం



శ్రీశైలం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ

శ్రీశైలం: కుష్టువ్యాధి నివారణకు కృషి చేద్దామని డీఎం అండ్ హెచ్‌ఓ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా వ్యాధిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు కృషి చేస్తామని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ఆశాకార్యకర్తలు ప్రతి ఇల్లు తిరిగి వ్యాధి గ్రస్తులను గురించి మండల వైద్య ఆరోగ్య అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్లు శోమశేఖరయ్య, డాక్టర్ శ్రవంతి, సీహెచ్‌ఓ రామారావు, పీహెచ్‌ఎన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్మకూరు: కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ నారాయణరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని పీహెచ్‌సీ వద్ద మంగళవారం పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాల వైద్య సిబ్బందితో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు లక్ష్మీదేవి, సుబ్బలక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి



చెంచు విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 21 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి దేవస్థానం ఈఓ లవన్నను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఆలయ క్యూలైన్లు పరిశీలించి, ఎంతమంది భక్తులు వేచి ఉంటారు..అని ఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాగాలంకరణ కార్యక్రమం గురించి, వీఐపీల గ్యాలరీ ఏర్పాటు, ప్రొటోకాల్ దర్శన ఏర్పాట్లు, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం జరిగే నాగులకట్ట ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈఓకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు మేరాజోత్ హనుమంత్‌నాయక్, మాధవీలత, విజయలక్ష్మి, దేవస్థాన ఏఈఓ ఫణిధర్, ఈఈ రామకృష్ణ, పీఆర్వో టి.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకులు అనీల్ కుమార్ ఉన్నారు.

చెంచు కాలనీలో కలెక్టర్ పర్యటన

శ్రీశైలం పరిధిలోని మేకలబండ చెంచుకాలనీలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మంగళవారం పర్యటించారు. చెంచుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లక్రితం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతనంగా ఇళ్లు నిర్మించాలని చెంచులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే మరుగుదొడ్లు లేవని, వీధి దీపాలు కూడా లేక రాత్రివేళ అంధకారంలో తిరుగుతున్నామని తదితర తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి ఆదేశాలు జారీ చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అప్పుడే స్కూల్ నుంచి వస్తున్న చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. కలెక్టర్‌తో పాటు ఆత్మకూరు ఆర్డీఓ దాస్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

గడివేముల: అర్హత ఉన్న వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో నూతనంగా జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గ్రామంలో 65 మందికి ఇళ్లస్థలాలు త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శిరుప శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి, వీఆర్వో హరీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

దొర్నిపాడు: రబీలో సాగు చేసిన పంటలను రైతులు ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. మంగవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రబీ సాధారణ సాగు 16,797 ఎకరాలు ఉండగా 15,265 ఎకరాల్లో పంటలు వేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 13,250 ఎకరాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ–క్రాప్ నమోదు చేశారన్నారు. శనగ, మినుము, జొన్న, వరి తదితర పంటలను అధికంగా సాగు చేశారని, వచ్చే నెల 15లోగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ నమోదుకు ఆధార్, బ్యాంకుఖాతా, ఫోన్ నంబర్, భూమి సంబంధించిన వివరాలను తప్పని సరిగా ఇవ్వాలన్నారు. ఈ–క్రాప్ చేసిన వెంటనే ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు.

లైన్‌మెన్‌కు సత్కారం

ఉయ్యాలవాడ : గణతంత్ర దినోత్సవం రోజు ఉత్తమ పురస్కారం అందుకున్న అల్లూరు అసిస్టెంట్ లైన్‌మెన్ సుంకయ్యను విద్యుత్‌శాఖ ఉద్యోగులు సన్మానించారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ గురప్ప ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. ఏఈ మాట్లాడుతూ జిల్లా విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి చేతుల మీదుగా అవార్డు పొందడం అభినందనీయమన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించడంతో ఉత్తమ అవార్డు దక్కిందన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు అబ్దుల్‌సలాం, నాగస్వామి నాయక్, అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారాలకు ఎంట్రీల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారాలు–2022 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, అయ్యన్న పేర్కొన్నారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2022 జనవరి నుంచి 2022 డిసెంబర్ వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రచురితమైన కవిత సంపుటాలను ఎంట్రీలుగా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ కవితాలను ఏప్రిల్ 27వ తేదీన ప్రకటించనున్నట్లు వారు వివరించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు ఉత్తర్ ప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీబీఎస్‌సీ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీలకు సెయింట్ జోసఫ్ పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన శ్రీనిధి, ఇమ్మరాజులను పాఠశాల ప్రిన్సిపాల్ ఐశ్వర్య రెడ్డి మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అభినందించారు. రంగారెడ్డి జిల్లాలో గత నవంబర్ 30 వతేదీన నిర్వహించిన సీబీఎస్‌సీ క్లస్టర్ –7 పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తెలిపారు.

బస్సుల్లో పాసులు అనుమతించాలి

మహానంది: పలువురు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు అల్ట్రా పల్లెవెలుగు, ఇతర పేర్లతో బస్సు పాసులను అనుమతించకపోవడంతో గాజులపల్లె నుంచి నంద్యాలలోని కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. నంద్యాల–గిద్దలూరు మార్గంలో గిద్దలూరు, మార్కాపురం మీదుగా నంద్యాలకు వచ్చే బస్సుల్లో పాసులు అనుమతించి కళాశాలలకు సరైన వేళలకు వెళ్లేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పునరుత్పాదక విద్యుత్‌దే భవిష్యత్

కర్నూలు(సెంట్రల్): భవిష్యత్ పునరుత్పాదక విద్యుత్‌దేనని మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ ప్రతినిధులు అరవింద్(సైంటిస్ట్), రాదేశ్యామ్ పేర్కొన్నారు. మంగళవారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు మెగా అల్ట్రా సోలార్ పార్కును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. సోలార్ పవర్, గాలిమరలు ద్వారా కర్నూలులో అత్యధికంగా విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఈ విషయాలను ఫీల్డ్ విజిట్‌ల ద్వారా చూసి ప్రత్యక్ష అనుభూతిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సురేఖారెడ్డి, ఇంజినీర్లు పాల్గొన్నారు.

పశు వైద్యశాలకు మరమ్మతులు



మరమ్మతు పనులపై అధికారులతో చర్చిస్తున్న గంగుల మనోహర్‌రెడ్డి

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నెలో పశు వైద్యశాల మరమ్మతులకు మండల నిధుల నుంచి రూ.3.5 లక్షలు మంజూరు చేయించినట్లు పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి తెలిపారు. భవనం నిర్మించి చాలా ఏళ్లు కావడంతో గోడలు, అంతర్భగంలో బండలు,పై కప్పు తదితరవి దెబ్బతిన్నాయన్నారు. ఈ విషయాన్ని పశు వైద్య సహాయ సంచాలకులు గిడ్డయ్య, పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ తన దృష్టికి తీసుకురావడంతో సహకార సంఘం డైరెక్టర్ గోపిరెడ్డి పుల్లారెడ్డితో కలిసి వెళ్లి ఆ భవనాన్ని పరిశీలించారు. తర్వాత ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి రూ.3.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ

శిరివెళ్ల: రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నాయక్ వసీం అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలను నీటితో త్వరగా నింపాలన్నారు. చేతి పంపులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా పనితీరును సభకు వివరించారు. పీఆర్ ఏఈ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో పంచాయతీ, మండల, జెడ్పీ నిధులతో సిమెంట్ల రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కోటపాడు, మహాదేవపురం, జీనేపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిందన్నారు. 10 పనులకు నిధులు మంజూరు కాగా మహాదేవపురంలో రూ. 20 లక్షలతో పనులు పూర్తయ్యాయన్నారు. వెంకటాపురానికి కొత్తగా రూ. 10 లక్షలు జెడ్పీ నిధులు మంజూరయ్యాయన్నారు. యర్రగుంట్లలో రూ. 15 లక్షలతో సిమెంట్ల రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రాచారి మాట్లాడుతూ ప్రజలకు సరిపడ తాగునీరు అందించేందుకు రూ. 8 కోట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే మండల కేంద్రంలో రూ.5.35 కోట్లతో మురికి కాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. హౌసింగ్ ఏఈ అహమ్మద్‌బాషా మాట్లాడుతూ ఉగాది నాటికి పక్కా గృహాల గృహ ప్రవేశాలు జరగాలన్నారు. మండలంలో ఇప్పటికి 453 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. మరో 82 గృహాల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయన్నారు. కార్య్రకరమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఎంపీడీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఈఓ ఆర్డీ సాల్మన్‌రాజు, ఎంఈఓ శోభా వివేకవతి పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, కోచింగ్ సెంటర్లు, సచివాలయ కార్యాలయాలను సందర్శించి తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని గ్రాడ్యుయేట్లను కోరారు. స్థానిక గురురాజ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే సీమాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నల సాయిరాంరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ తమీమ్ అన్సారి, రహంతుల్లా, సాధిక్, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఆర్‌యూ జట్టు



విజేతగా నిలిచిన రాయలసీమ యూనివర్సిటీ జట్టు

కర్నూలు (టౌన్): గత ఐదు రోజులుగా రాయలసీమ యూనివర్సిటీలో జరుగుతున్న కర్నూలు జోన్ అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల జట్టు 16 ఓవర్లలో 101 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ దిగిన ఆర్‌యూ జట్టు 13 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 102 స్కోర్ చేసి విజేతగా నిలిచింది. స్థానిక యూనివర్సిటీలో విజేతలకు ఆర్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సివి.కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వి.శివకిషోర్ పాల్గొన్నారు.

స్కిల్‌హబ్‌ల మరమ్మతులను త్వరగా పూర్తి చేయండి

- జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆర్‌అండ్‌బీ సీఈ మాధవీ సుకన్య



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, ఈఈ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఫేజ్–2 కింద చేపట్టిన స్కిల్‌హబ్‌ల మరమ్మతులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీరు (బిల్డింగ్స్) మాధవీ సుకన్య ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కే నాగరాజు, కర్నూలు ఈఈ ఏవీ శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.40 లక్షలతో కర్నూలు, కోడుమూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాల్లోని స్కిల్‌హబ్‌లకు చేపట్టిన మరమ్మతులను ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే జిల్లాలోని వెల్దుర్తి మండలం రామళ్లకోట, గోవర్ధనగిరి, గూడూరు మండలం కే నాగలాపురం, గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు, ఆస్పరి మండలం ములుగుందం, కోసిగి మండలం కందుకూరు, దేవనకొండ మండలం తెర్నేకల్, మంత్రాలయం మండలం కాచాపురం, పెద్దకడుబూరు మండలం హెచ్ మురవని గ్రామాల్లో రూ.18.57 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయన్నారు. ఈ భవన నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించేందుకు రెండు, మూడు రోజుల్లో పాలనా అనుమతులు మంజూరు కానున్నట్లు చెప్పారు. పాలనా అనుమతులు మంజూరైన వెంటనే టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.